సమష్టిగా పని చేద్దాం.. అభివృద్ధి సాధిద్దాం

నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం: ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్



ప్రజాప్రతినిధులు, అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న మనోహర్, పార్థసారథి, వెట్రిసెల్వి, ప్రతాప్ శివకిశోర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధికి సమష్టిగా పని చేద్దామని పౌరసరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కౌలు రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కౌలు రైతులందరికీ రుణ అర్హత కార్డులు అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యేలు బడేటి చంటి, పి.ధర్మరాజు, రోషన్ కుమార్, చిర్రి బాలరాజు, మద్దిపాటి వెంకటరాజు, జేసీ పి.ధాత్రిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో రీసర్వే పూర్తయిన 252 గ్రామాల్లో సభలు నిర్వహించి అభ్యంతరాలను స్వీకరిస్తున్నాం. ఉపాధి హామీ కింద రూ.103 కోట్లతో సీసీ రహదారుల నిర్మాణాన్ని జనవరి 15 నాటికల్లా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. **- వెట్రిసెల్వి, కలెక్టర్**

జిల్లాలోని అటవీ భూముల్లో సర్వే నిర్వహించి సరిహద్దులను నిర్ణయించాలి. ఇటీవల వరదలు, వర్షాలతో దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేయించాలి. తమ్మిలేరు, బుడమేరు, రామిలేరులో పూడిక తీత పనులు చేపట్టాలి. **- మంత్రి పార్థసారథి**

జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడతాం. ఏలూరులో పారిశుద్ధ్యం, తాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాం. గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాపై నిఘాను మరింత పటిష్ఠం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నా. **- మనోహర్**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నాం. కొన్ని పోలీసు స్టేషన్లు శిథిల స్థితిలో ఉన్నాయి. మరమ్మతులు చేయాల్సి ఉంది. **-కె.ప్రతాప్ శివ కిశోర్, ఎస్పీ**

నేడు జిల్లా అభివృద్ధి సమన్వయ సమావేశం


ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం 23న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఎంపీ మహేశ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షిస్తారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మండల పరిషత్తు అధ్యక్షులు హాజరు కావాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు.

తగ్గిన వరద

పోలవరం ప్రాజెక్టు వద్ద బయటపడుతున్న నిర్మాణాలు

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరిలో వరద పూర్తిగా తగ్గడంతో పోలవరం ప్రాజెక్టు ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల వద్ద పనుల నిమిత్తం టిప్పర్ల రాకపోకలకు వీలుగా గతంలో నిర్మించిన రోడ్డు బయటపడింది. గండ్ల ద్వారా ప్రస్తుతం స్పిల్‌వే నుంచి నీరు గోదావరిలోకి వెళుతోంది. మరోవైపు దిగువ కాఫర్ డ్యాం వద్ద మోటార్లు ఏర్పాటు చేసి డీప్లీటింగ్ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి నీటిని మళ్లించడంతో పాత డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతం మంగళవారం నాటికి కొంత మేర బయటపడింది. ప్రస్తుతం స్పిల్‌వే వద్ద నీటి మట్టం 26.70 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 70వేల క్యూసెక్కులు దిగువకు వెళుతోంది.

ప్రాజెక్టు స్పిల్‌వే ఛానల్ వద్ద రోడ్డు





వసంతకాలనీ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో అధికారుల పరిశీలన, (అంతర చిత్రంలో) చిరుతపులి కాలిగుర్తులు)

ఎటు వెళ్తుందో..?

దొరకని చిరుత
ఫలించని అధికారుల వ్యూహాలు

భీమడోలు, న్యూస్‌టుడే: నిఘా కెమెరాలతో చిరుత సంచార ప్రాంతాలను అధికారులు జల్లెడపడుతున్నారు. నిర్దేశిత ప్రాంతాల్లో బోను ఏర్పాటు చేస్తున్నారు. అయినా వారి వ్యూహాలకు చిరుత చిక్కడం లేదు. భీమడోలు శివారు, ద్వారకాతిరుమల మండల పరిధిలోని ఎం.నాగులపల్లి పరిసర ప్రాంతాల్లో చిరుతపులి సంచారంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. చిరుత ఇక్కడే ఉందా లేదా.. అని తెలియక ప్రజలు గాబరాపడుతున్నారు. అంబరుపేట పంచాయతీ పరిధిలోని వసంతకాలనీ ప్రాంతంలో చిరుతపులి కాలి గుర్తులను మంగళవారం అధికారులు గుర్తించారు. ఇటీవల రాజమహేంద్రవరం ప్రాంతంలో కనిపించిన చిరుతపులి ఇదేనని అధికారులు భావిస్తుండటం గమనార్హం. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని రైతులు వ్యవసాయ క్షేత్రాల్లోకి ఒంటరిగా వెళ్లవద్దంటూ అటవీశాఖాధికారులు హెచ్చరికలు చేశారు. డిప్యూటీ డీఎఫ్‌వోలు శ్రీదేవి, దావీదురాజునాయుడు, ఏలూరు రేంజర్ కుమార్, సురేష్‌కుమార్, కుమార్‌సింగ్ తదితరులు బృందాలుగా ఏర్పడి చిరుతను బంధించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. "వసంతకాలనీ ప్రాంతంలో చిరుతపులి సంచరించినట్లు స్థానికులు చెప్పటంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించాం. చిరుత కాలి గుర్తులు వాస్తవమే.' ' అని అటవీశాఖ రేంజర్ కుమార్ అన్నారు.

అడుగడుగునా దగా

ఈనాడు, ఏలూరు, నూజివీడు, పట్టణం, న్యూస్‌టుడే

ప్రకృతి వైపరీత్యాలు, అప్పుల బాధలు.. పెట్టుబడి కష్టాలు ఓ వైపు వెన్ను విరుస్తున్నాయి. గోరుచుట్టుపై రోకటి పోటులా కొన్ని విత్తన కంపెనీలు దందా చేస్తూ నష్టాల ఊబిలోకి నెడుతున్నాయి. తమ కంపెనీ విత్తనాలే కొనాలని నాసిరకం అంటకట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అరకొరగా పండిన పంటను కొనుగోలు చేసి నగదు చెల్లించకుండా టోకరా వేస్తున్నారు. మోస పోయిన రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ముసునూరు మండలం గుళ్లపూడికి చెందిన దాదాపు 18 మంది రైతుల నుంచి ఓ విత్తన కంపెనీ ఆర్గనైజర్లు మొక్కజొన్న కొనుగోలు చేశారు. దాదాపు రూ.16 లక్షల వరకు బకాయిలు చెల్లించాలి. ఏడు నెలల నుంచి పైసా చెల్లించలేదు. కొనుగోలు చేసిన ఆర్గనైజర్ పత్తా లేకుండా పోయారు. ఈ తరహా మోసాలు జిల్లా వ్యాప్తంగా జరిగినట్లు పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనా ఫలితం లేదు.

నమ్మించి.. వంచించి

ఈ ముసుగులో కొన్ని కంపెనీలు, ఆర్గనైజర్లు భారీ కుంభకోణాలు చేస్తున్నారు. రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. దీంతో ఎకరానికి 1-2 టన్నులలోపే దిగుబడి వస్తోంది. నష్టం వచ్చింది కాబట్టి పరిహారం ఇస్తామని రైతులను నమ్మించి పంటను కొనుగోలు చేస్తున్నారు. విత్తనోత్పత్తికి తరలించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. రైతులకు ఇవ్వాల్సిన పరిహారంతోపాటు పంట అమ్మిన బకాయిలు ఇవ్వకుండా జెండా పీకేస్తున్నారు. ఏలూరు జిల్లా పరిధిలో ముసునూరు, లింగపాలెం, పెదవేగి, ఆగిరిపల్లి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, నూజివీడు, చింతలపూడి, కొయ్యలగూడెం మండలాల్లో దాదాపు 4 వేల మంది రైతులకు దాదాపు రూ.2 కోట్లకు పైగా ఎగనామం పెట్టారు.

గోరంత పెట్టుబడి.. కొండంత లాభం

రైతుల నుంచి కొనుగోలు చేసిన కేజీ మొక్కజొన్నకు కంపెనీలు రూ.30 మాత్రమే చెల్లిస్తున్నాయి. విత్తనోత్పత్తి కేంద్రాలకు తరలించి ప్రాసెస్ అనంతరం రూ.300కు బయట అమ్ముకుంటున్నారు. ఎకరం సాగుకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టిన రైతులకు కనీస మొత్తం కూడా చెల్లించకుండా మోసం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు.



మోసగించిన కంపెనీలు

కొన్న పంటకు సొమ్ము చెల్లించని వైనం

పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

రూ.2.5 లక్షలు ఇవ్వాలి

పదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. 28 టన్నుల దిగుబడి వచ్చింది. కంపెనీ వారు రూ.7.6 లక్షలు చెల్లించాలి. రూ.5 లక్షలు ఇచ్చి చేతులెత్తేశారు. ఏడు నెలలైనా నగదు రాలేదు. అప్పు చేసి సాగు చేస్తే దిగుబడి రాక బకాయిలు ఇవ్వక నిండా మునిగిపోయాను. **–జాలా రవి, రైతు, ముసునూరు**

రూ.1.9 లక్షలు ఎగ్గొట్టారు

5 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా 10 టన్నుల దిగుబడి వచ్చింది. రూ.2.1 లక్షలు రావాలి. ఇప్పటి వరకు పెట్టుబడి సాయంగా ఇచ్చిన రూ.20 వేలు తప్ప పైసా రాలేదు. అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. **– కర్రా రామకృష్ణ, రైతు, గుళ్లపూడి**

ఇదీ విధానం

మొక్కజొన్న విత్తనోత్పత్తి కోసం కంపెనీలకు సంబంధించి ఆర్గనైజర్లు ఉంటారు. వారు గ్రామాల్లో ఫీల్డ్ స్టాఫ్‌ను ఎంపిక చేసుకుంటారు. వారి ద్వారా రైతులను కలిసి తమ విత్తనాలే సాగు చేసేలా ప్రోత్సహిస్తారు. ఈ ప్రక్రియలో రైతులకు ఉచితంగా సరఫరా చేస్తారు. ఎకరానికి 2 నుంచి 3 టన్నుల వరకు దిగుబడి వస్తుందని ప్రచారం చేస్తారు. ఎకరానికి రూ.20 వేలు పెట్టుబడి సాయం కూడా ఇస్తారు. ఆ స్థాయిలో దిగుబడి రాకుంటే బాధ్యత వహిస్తూ ఎకరానికి రూ.75-80 వేల వరకు పరిహారంగా ఇచ్చేలా హామీ ఇస్తారు. రైతులు మాత్రం ఆ కంపెనీలకే మొక్కజొన్న అమ్మాలన్నది షరతు.

25న ఉద్యోగ మేళాలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25న జంగారెడ్డిగూడెంలోని రామచంద్ర డిగ్రీ కళాశాల, నూజివీడు ప్రభుత్వ ఐటీఐలలో ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఇన్‌ఛార్జి వి.కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగి పదో తరగతి, ఇంటర్, ఐటీఐ,డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చదివిన వారు హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 91823 42688, 83740 39719 నంబర్లలో సంప్రదించవచ్చని వివరించారు.

జ్ఞానమూర్తి.. విశ్వకీర్తి

వీణాపాణిగా మలయప్ప స్వామి దర్శనం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం వీణాపాణిగా, చదువుల తల్లి సరస్వతీ అవతారంలో దర్శనమిచ్చారు. మలయప్ప స్వామి వీణ ధరించి హంస వాహనరూఢుడై వివేకాన్ని భక్తులకు బోధిస్తున్నట్లు కనిపించారు. గోవింద నామస్మరణ నడుమ దేవదేవుడు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ జ్ఞానమూర్తిగా ప్రకాశించారు. తొలుత విష్వక్సేన పూజ, పంచామృత మండపారాధన, స్నపనం, అష్టాదశ పాద పద్మారాధన కార్యక్రమాలను పండితులు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల నేతృత్వంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.★ బుధవారం అష్టాదళ శత కలశాభిషేకం, కోదండరామ అలంకరణలో హనుమత్‌వాహన సేవ ఉంటాయి.



స్వామికి అభిషేక క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీవారికి అష్టదళ పాదపద్మారాధన నిర్వహిస్తున్న అర్చకులు



ఆకట్టుకున్న శక్తివేషధారుల ప్రదర్శన

మద్యం తయారీ కంపెనీల్లో అక్రమాలపై సోదాలు

వంగూరు, చేబ్రోలులో సీఐడీ తనిఖీలు



లారీలో సరకు లోడ్ చేస్తుండగా ఫొటోలు తీస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు

ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే-ఏలూరు నేరవార్తలు, ఉంగుటూరు: వైకాపా హయాంలో మద్యం విక్రయాల్లో జరిగిన అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాల నిగ్గు తేల్చేందుకు రంగం సిద్ధమైంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా సీఐడీ బృందాలు మద్యం తయారీ పరిశ్రమలపై ఏకకాలంలో దాడులు చేశాయి. పెదవేగి మండలం వంగూరు పరిధిలోని గౌతమి ఆగ్రో ఇండస్ట్రీ, ఉంగుటూరు మండలం చేబ్రోలులోని సోరింగ్ స్పిరిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ లిక్కర్ పరిశ్రమల్లో తనిఖీలు జరిగాయి. వైకాపా పాలనలో మద్యం విక్రయాలు, రవాణా, దస్త్రాల నిర్వహణ తదితర అంశాలపై అధికారులు నిశితంగా పరిశీలించారు.

నాణ్యతపై ఆరా.. వంగూరు, చేబ్రోలు రెండు చోట్లా విశాఖ, రాజమహేంద్రవరానికి చెందిన అధికారులు, సిబ్బంది కలిసి 50 మంది వరకు సోదాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగాయి. పరిశ్రమల్లో సరకు తయారీ కేంద్రాలు గిడ్డంగులు, ఇతర విభాగాలను తనిఖీ చేశారు. వైకాపా పాలనలో తయారు చేసిన మద్యం బ్రాండ్లలో ప్రమాణాలు పరిశీలించారు. నాసిరకం మద్యం తయారీ జరిగిందా అన్న కోణంలో తనిఖీ చేశారు. సరకు రిజిస్టర్ల నిర్వహణ, ఇతర ఆర్థిక అంశాల గురించి ఆరా తీశారు. గతంలో తయారు చేసిన మద్యంలో స్పిరిట్, ఆల్కహాల్ శాతం తెలుసుకునేందుకు కొంత సరకును స్వాధీనం చేసుకున్నారు. ప్రయోగశాలలో పరీక్షించి నాణ్యత తెలుసుకుంటారు.

దస్త్రాలన్నీ స్వాధీనం.. వైకాపా పాలనలో జరిగిన మద్యం లావాదేవీలకు సంబంధించిన అన్ని దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని విజయవాడలోని సీఐడీ కార్యాలయానికి తరలించి ఆబ్కారీ శాఖ అధికారులు, నిపుణులతో పరిశీలిస్తారని తెలుస్తోంది. పరిశ్రమల్లో ఎంత మంది విధుల్లో ఉన్నారు. జీతాలు ఎలా ఇస్తున్నారు అనే అంశాలపైనా అడిగి తెలుసుకున్నారు. డిస్టిలరీ వద్ద భద్రత పెంచారు. మంగళవారం లారీల్లో ఎంత సరకు పంపిస్తున్నారో ఫొటోలు తీసి నమోదు చేసుకుంటున్నారు. డిస్టిలరీ మేనేజర్ నాగేశ్వరరావు, ఇతర కీలక సిబ్బందిని తమ వద్దే ఉంచుకుని వివిధ అంశాలకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నారు.

మేనేజర్లను, ఇతర కీలక సిబ్బందిని ప్రత్యేకంగా విచారించారు. బుధవారం సైతం తనిఖీలు కొనసాగే అవకాశం ఉంది.

పైపై పూతలు.. రూ.కోట్లలో లెక్కలు..!

నాసిరకంగా రహదారి మరమ్మతులు



గోతుల దారిలో ప్రయాణికుల ఇక్కట్లు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: రహదారి మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు మచ్చుకైనా కానరావడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్వహించిన పనులు వారం రోజులకే అధ్వానంగా తయారవుతున్నాయి. తాడేపల్లిగూడెం పట్టణం మీదుగా వెళ్లే ప్రత్తిపాడు-బాదంపూడి రహదారి సుమారు 12 కి.మీ మేర ఉంటుంది. ప్రతిరోజు సుమారు 25 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అడుగుకో గుంతతో అతుకుల బొంత తలపించే ఈ మార్గంపై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత వైకాపా ప్రభుత్వం నూతన రహదారిని నిర్మించకుండా కేవలం మరమ్మతులకే నిధులు కేటాయిస్తూ వచ్చింది. అయిదేళ్ల కాలంలో రూ.1.02 కోట్లతో పలుమార్లు గోతులను పూడ్చారు. అధికారులు, పాలకులు చేతివాటం ప్రదర్శిస్తూ మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చారు.

మూణ్నాళ్ల ముచ్చటే.. ఏ మాత్రం నిబంధనలు పాటించకుండా గుత్తేదారులు ఇష్టానుసారంగా పనులు చేపట్టారు. గోతుల్లో పలుచగా తారు పోసి వాటిల్లో రాళ్లు కుమ్మరించారు. వాటిపై క్రషర్ డస్ట్ పోసి రోలర్‌తో చదును చేశారు. రాళ్లు, క్రషర్ డస్టుతో మాత్రమే గోతులు పూడ్చటంలో కొన్ని రోజులకే రహదారి యథాస్థితికి వస్తోంది. ప్రస్తుతం మరమ్మతుల కోసం మరో రూ.90 లక్షలు కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ముత్యాలాంబపురం సమీపంలో భారీ గుంత

పట్టభద్రుల ఓటుకు 8,164 మంది దరఖాస్తు

ఈనాడు డిజిటల్, భీమవరం: ఉభయగోదావరి జిల్లా పరిధిలోని పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. మార్చి 2025లో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన వారు నవంబరు ఆరు వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఫారం-18 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటికే కూటమి అభ్యర్థిని ప్రకటించగా, ప్రధాన రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సైతం పోటీ పడే అవకాశం ఉంది. గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకున్న వారు సైతం పాత ఓటర్ల జాబితా రద్దవడంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే. ఎప్పటికప్పుడు కొత్త జాబితాతోనే ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తారు. సోమవారం నాటికి 8,164 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఉద్యాన వర్సిటీలో 24, 25 తేదీల్లో కౌన్సెలింగ్

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వెంకట్రామన్నగూడెం వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని 5 ప్రభుత్వ, 3 ప్రైవేటు ఉద్యాన కళాశాలల్లో బీఎస్సీ (హానర్స్) నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 24, 25 తేదీల్లో వర్సిటీ పరిపాలన భవనంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈఏపీ సెట్ ర్యాంకుల ఆధారంగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గురు, శుక్రవారాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ http://drysrhu.ap.gov.in ను సంప్రదించాలని తెలిపారు.

పాఠశాలల నిర్వహణకు నిధులు



ఈనాడు డిజిటల్, ఏలూరు, తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఓ వైపు నిధుల్లో కోత... మరోవైపు విడుదలలో జాప్యం వెరసి గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు, కార్యాలయాల నిర్వహణ ఉపాధ్యాయులు, అధికారులకు భారంగా మారింది. నాడు-నేడు ద్వారా రూపురేఖలు మార్చామని చెప్పినా కనీసం నిర్వహణకు అవసరమైన నిధులను రెండేళ్లుగా విడుదల చేయలేదు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బడుల నిర్వహణకు రూ.100 కోట్లు మంజూరు చేయడంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ★ పాఠశాలల నిర్వహణతో పాటు మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ), స్కూలు కాంప్లెక్స్‌ల (సీఆర్సీ)కు నిధులు విడుదల చేయాల్సి ఉన్నా కొరత పేరుతో 2021-22లో 20 శాతం మాత్రమే విడుదల చేసి గత ప్రభుత్వం మమ అనిపించింది. తర్వాత రెండేళ్లు ఎమ్మార్సీ, స్కూలు కాంప్లెక్స్‌లకు నిధులను విడుదల చేయలేదు. చాక్‌పీస్‌లు, రిజిస్టర్ల కొనుగోలు, విద్యుత్తు బిల్లుల చెల్లింపులకు ప్రధానోపాధ్యాయులు జేబుల్లోంచి ఖర్చు చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి.. ఉమ్మడి జిల్లాలో 3,179 పాఠశాలలకు సుమారు రూ.7 కోట్లు, 47 ఎంఆర్సీలకు ఒక్కోదానికి రూ.70 వేల చొప్పున, 261 సీఆర్సీలకు ఒక్కో కాంప్లెక్స్‌కు రూ. 21 వేల చొప్పున బకాయిలున్నాయి.

ఆహా అన్నారు.. భారం మోపారు

● నిలిచిన వాయిదాల చెల్లింపులు ● కొలిక్కిరాని నిధుల లెక్క

- నూజివీడులో మైలవరం బస్టాండ్ సమీపాన ఏర్పాటు చేసిన స్టాల్ మూతపడగా తీసుకున్న రూ.13,500లో ఇంకా రూ.13 వేలు బకాయి ఉంది.
- నరసాపురం బస్టాండ్ సమీపాన ఏర్పాటు చేసిన క్యాంటీన్‌కు సంబంధించి రూ.10 వేల బకాయి ఉంది.
- జంగారెడ్డిగూడెం స్టాల్ నెలలోపే మూతబడింది. రూ.13 వేలు టీఎల్ఎఫ్‌లో జమకాలేదు. తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రి వద్ద స్టాల్‌కు సంబంధించి రూ.3500 బకాయి ఉంది.

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే, పురపాలక బృందం: వైకాపా పాలనలో పట్టణాల్లో ప్రవేశపెట్టిన ఆహా క్యాంటీన్లు మహిళా సంఘాలను ఆర్థికాభ్యున్నతికి దోహదం చేయకపోగా వారికి భారం మిగిల్చాయి. నెలల వ్యవధిలోనే ఇవి మూతపడటంతో వాయిదాల చెల్లింపులు నిలిచిపోయాయి. నిర్వాహకులకు ఇచ్చిన రుణాలకూ లెక్కల్లేవు.



భీమవరంలో ఆహా క్యాంటీన్ (పాత చిత్రం)


ఉమ్మడి జిల్లాలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురాల్లో మెప్మా సంఘాల సభ్యులతో ఆహా క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఆదరణ లేకపోవడం, నిర్వహణ లోపాల కారణంగా ఇవన్నీ మూతపడ్డాయి. క్యాంటీన్ ఏర్పాటుకు అవసరమయ్యే తాత్కాలిక స్టాల్ (కియోస్క్) నిమిత్తం నిర్వాహకుల పేరిట తీసుకున్న నగదు పట్టణ సమాఖ్య (టీఎల్ఎఫ్)లో జమకాలేదు. కొన్ని పట్టణాల్లో ఎస్ఎల్ఎఫ్ నిధులకూ లెక్కలు చెప్పకపోవడంపై సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

పద్దులను పరిశీలిస్తాం.. ఆహా క్యాంటీన్ల నిర్వహణ వివరాలు తీసుకుని పద్దులను, టీఎల్ఎఫ్‌లకు నగదు జమ అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని మెప్మా జీవనోపాధుల పర్యవేక్షక అధికారి సీహెచ్ నానిబాబు చెప్పారు.

సందేహాలెన్నో.. తాత్కాలిక స్టాల్‌కు రూ.13,500 టీఎల్ఎఫ్ నుంచి ఇచ్చారు. ఈ మొత్తాన్ని ప్రతి నెలా రూ.500 చొప్పున తిరిగి చెల్లించాల్సి ఉండగా పూర్తిస్థాయిలో జమ కాలేదు. కొన్ని పట్టణాల్లో ఎస్ఎల్ఎఫ్ నుంచి రుణాలుగా రూ.లక్షలు ఇచ్చినట్లు పద్దులు రాశారు. ఈ సొమ్ములు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో తెలియని పరిస్థితి. ప్రతి నెలా పొదుపు చేసి పట్టణ సమాఖ్యలో దాచుకునే నగదును ఇలా దుబారా చేయడంపై సమాఖ్యల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లల్లో సౌర కాంతులు

ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీతో పరికరాలు



ఈనాడు, విశాఖపట్నం: 'సౌర విద్యుత్తు' వినియోగానికి ముందుకొచ్చేవారికి 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ' పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిస్తున్నాయి. మూడు కిలోవాట్లకు రూ.78 వేల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుంది. మిగిలిన సొమ్ములు లబ్ధిదారులు భరించాలి. అయితే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగానే సౌర విద్యుత్తు అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిస్కంల వారీగా ఆయా వర్గాల లబ్ధిదారులు వివరాలు సేకరిస్తున్నారు. సౌరఫలకలు ఇంటి పైభాగంలో అమర్చాలంటే సుమారు 100 చ.అ. విస్తీర్ణం అవసరం. ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఎస్టీ లబ్ధిదారుల్లో చాలా మంది పూరిళ్లు, పెంకుటిళ్లలోనే నివాసం ఉంటున్నారు. సోలార్ పరికరాలు అమర్చడానికి వీలులేని గృహాలే ఎక్కువ. మైదాన ప్రాంతంలోని ఎస్సీ లబ్ధిదారులున్నా చాలామంది కాలనీల్లో ఉంటున్నారు. ఇంటి పైకప్పులు సోలార్ ఏర్పాటుకు అనువుగాలేవని అధికారులంటున్నారు.

తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలోని అయిదు ఉమ్మడి జిల్లాల్లో 7.22 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి.

ఈపీడీసీఎల్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్తు కనెక్షన్ల వివరాలు

	ఎస్సీ	ఎస్టీ
ఏలూరు	1,47,630	23,295

● ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల లోపు వినియోగించేవారికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ఈ విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు అంతా ప్రభుత్వం భరిస్తుంది. ఒక్కో యూనిట్‌పై సుమారు రూ.6 వరకు వెచ్చిస్తోంది. సోలార్ ద్వారా ఉచితంగా అందించగలిగితే ప్రభుత్వానికి ఆ మేరకు ఆదా అయినట్లే. లబ్ధిదారులు చాలా మంది 100 నుంచి 150 యూనిట్ల మధ్య వినియోగిస్తుంటారు. ఒక కిలోవాట్ సోలార్ ఉపకరణాలతో నెలకు 120 యూనిట్లు సౌరశక్తి ద్వారా అందుబాటులోకి వస్తుంది. మిగతా 30 యూనిట్ల భారమే ప్రభుత్వంపై పడుతుంది.

● 'ఇళ్లలో వినియోగించే విద్యుత్తు కంటే సోలార్ ద్వారా ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి జరిగితే ఆ మిగులును డిస్కంకు తిరిగి అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. ఒకసారి సోలార్ ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా విద్యుత్తు అందుతుంది. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గుర్తింపు సర్వే పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాచరణ ఉంటుంది' అని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అభ్యర్థులకు వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. టెట్ అర్హత కలిగి ఉండి, వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 25వ తేదీలోగా జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు



వృద్ధునికి గుర్తింపు కార్డు అందజేస్తున్న డీఆర్వో పుష్పమణి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వృద్ధుల సంరక్షణకు ప్రత్యేకంగా చట్టాలున్నాయని జిల్లా రెవెన్యూ అధికారి పుష్పమణి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్వో మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం 15 మంది వృద్ధులను సత్కరించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘాల నాయకులు నారాయణమూర్తి, కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీఈవో ఎస్.అబ్రహం తదితరులు పాల్గొన్నారు.



స్కేటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా కార్యదర్శి కె.రమేష్, శిక్షకులు

బాలబాలికల ఉన్నతికి క్రీడలు దోహదం

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: బాలబాలికల ఉన్నతికి క్రీడలు దోహదపడతాయని ఉమ్మడి జిల్లా స్కేటింగ్ సంఘం కార్యదర్శి కె.రమేష్ అన్నారు. స్థానిక ఇండోర్ మైదానంలో వివిధ విభాగాల్లో జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 95 మంది హాజరయ్యారు. మొదటి రోజు రింక్-1, 2, 3, 4, 5 విభాగాల్లో పోటీలు జరిగాయి. బుధవారం కలపర్రు బైపాస్ రోడ్డులోని రామచంద్ర కళాశాల వద్ద రోలర్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన బాల బాలికలు వచ్చే నెల 6న కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి డి.సురేష్, రాష్ట్ర పరిశీలకుడు రాము, డీఎస్ఏ శిక్షకుడు ఎస్‌కే ఖాసీం, ఉమ్మడి జిల్లాలోని శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

రుణదాతల వేధింపులకు బలి!

అపహరించి తరలిస్తుండగా తెదేపా ఎంపీటీసీ సభ్యుడి మృతి



జగన్నాథరాజు (పాతచిత్రం)

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: ప్రైవేటు రుణదాతలు, ఫైనాన్స్ సంసల వేధింపులకు తెదేపా నేత బలయ్యారు. చిత్తూరు జిల్లా పాలసముద్రం మండలం నరసింహాపురానికి చెందిన తెదేపా ఎంపీటీసీ సభ్యుడు జగన్నాథరాజు(51) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. సోమవారం రాత్రి చిత్తూరు నుంచి పాలసముద్రంకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా గంగాధరనెల్లూరు మండల సరిహద్దులో ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన జేసీబీ యంత్రాల ఫైనాన్స్ సంస్థకు చెందిన పది మంది రెండు కార్లలో వచ్చి జగన్నాథరాజును కిడ్నాప్ చేశారు. నూజివీడు సమీపంలో వెళ్తుండగా గుండెపోటుతో అతను మృతిచెందినట్లు కిడ్నాపర్లు కుటుంబీకులకు ఫోన్‌లో చెప్పారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నూజివీడుకు చెందిన వీరేశ్, శివ, మణి, చంద్ర, నాగరాజుతోపాటు మరో ఐదుగురిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు జీడీనెల్లూరు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

అన్నదాతలకు మేలు చేకూర్చేలా సంస్కరణలు



చేబ్రోలులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్, చిత్రంలో ఎమ్మెల్యేలు ధర్మరాజు, చింతమనేని

ఉంగుటూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, అన్నదాతలకు మేలు చేకూర్చేలా ఎన్డీయే ప్రభుత్వం సంస్కరణలు తెచ్చిందని పౌరసరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. చేబ్రోలు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షత వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ రైతులు సూచించిన మిల్లుకే ధాన్యాన్ని తరలించే వెసులుబాటు కల్పించామని తెలిపారు. వైకాపా హయాంలో నిర్మించిన రూ.3,300 కోట్లతో నిర్మించిన ఆర్బీకేలతో రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. గత ప్రభుత్వం మిల్లర్లకు సైతం రూ.976 కోట్ల బకాయిలు చెల్లించలేదన్నారు. తొలుత ఏపీ సాధికారిక సంస్థ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మనోహర్ పరిశీలించారు. సంయుక్త కలెక్టర్ ధాత్రి రెడ్డి, దెందులూరు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బొలిశెట్టి శ్రీనివాస్, జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, తెదేపా, భాజపా జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, విక్రం కిశోర్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, మాజీ సర్పంచి రాంధే రాజారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి వినతి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం ఏలూరు వచ్చిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధరరావు, నరసింహారావు, కృష్ణంరాజు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. డీలర్ల సమస్యలను మంత్రికి వివరించారు. కమీషన్ పెంచాలని, ఒక్కో డీలరుకు నెలకు రూ.25 వేల ఆదాయం లభించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఉచితంగా వినికిడి యంత్రాల పంపిణీ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: చెవుడు సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తుందని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి సమస్య ఉన్నవారు సదరం పత్రాలు సమర్పించి యంత్రాలను ఉచితంగా పొందవచ్చన్నారు. ఆధార్, రేషన్ కార్డుల జిరాక్సులు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, సదరం తనిఖీ ధ్రువపత్రం తదితరాలను ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని డీఈఐసీ విభాగంలో అందజేసి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది కొలువుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను www.deoeluru.org వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈవో ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలుంటే ఈ నెల 23 సాయంత్రం 5 గంటల్లోగా తగిన పత్రాలతో ఏలూరులోని సమగ్ర శిక్షా జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఉద్యోగ మేళాకు 254 మంది హాజరు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక డీఎల్‌టీసీలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. 254 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మౌఖిక పరీక్ష అనంతరం 98 మంది వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సహాయ సంచాలకుడు ఉగాది రవి తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుభూషణ రావు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పుస్తక రూపకల్పనలో విద్యార్థుల సామర్థ్యాలే ప్రామాణికం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా అధ్యయన పుస్తకాన్ని రూపొందించాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరీక్షల నిర్వహణ సంస్థ, విద్యా శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అధ్యయన పుస్తకాన్ని రూపొందించేందుకు స్థానిక డీసీఈబీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కార్యశాలను మంగళవారం ఆయన సందర్శించారు. గురువులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల సామర్థ్యాలను ప్రామాణికంగా తీసుకుని పుస్తకాన్ని తయారు చేయాలన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా అవగాహన కలిగించేలా సులభతర విధానంలో ప్రశ్నలు, వాటికి సంబంధించిన సమాధానాలు ఉండాలని సూచించారు.


శాస్త్రవేత్తల బృందం పరిశీలన



క్షేత్రస్థాయి సందర్శనలో కేంద్ర విత్తన పరిశీలన బృందం శాస్త్రవేత్తలు

మార్టేరు, న్యూస్‌టుడే: మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని కేంద్ర విత్తన పరిశీలన బృందం మంగళవారం సందర్శించింది. భారత వ్యవసాయ పరిశోధన మండలి (విత్తన అభివృద్ధి శాస్త్రం) ప్రధాన శాస్త్రవేత్తలు సంజీవ్‌కుమార్, అనిల్‌కుమార్, సీనియర్ శాస్త్రవేత్తలు బోజరాజ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతాప్‌బాసింగ్, శాస్త్రవేత్త బసవవిషెట్టితో కూడిన బృందం క్షేత్రస్థాయి సందర్శన చేశారు. పరిశోధన కేంద్రంలోని మూల విత్తనోత్పత్తి క్షేత్రాలు, విత్తన గిడ్డంగి, విత్తనశుద్ధి కేంద్రాలను సందర్శించి సూచనలు, సలహాలు ఇచ్చారు. స్థానిక పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరిశోధన, విత్తనోత్పత్తి గురించి ఆరా తీశారు. వీరి వెంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విత్తన ప్రధాన శాస్త్రవేత్త కృష్ణా నాయక్, ఏడీఆర్ టి.శ్రీనివాస్, వరి ప్రధాన శాస్త్రవేత్త ఎం.గిరిజారాణి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

36 అడుగుల మునగ చెట్టు!



ఇంటి ఆవరణలోని పెంచిన మునగచెట్టు ఏకంగా మూడంతస్తుల భవనం ఎత్తుకు ఎదిగి ఆశ్చర్యపరుస్తోంది. రెండేళ్ల క్రితం నాటామని కిందికి వాలకుండా ఉండేందుకు భవనానికి తాళ్లతో కట్టామని, అందుకే 36 అడుగుల వరకు పెరిగిందని చెబుతున్నారు పాలకొల్లుకు చెందిన షేక్ చాంద్‌బీబీ. ఏటా కాసే కాయలు కుటుంబ అవసరాలకు సరిపోతున్నాయని, ఎప్పుడూ పూతతోనే ఉంటుందన్నారు. ఈ మార్గంలో వెళ్లేవారంతా ఆసక్తిగా వీక్షిస్తున్నారు. దీనిపై తణుకు ప్రాంతీయ ఉద్యానాధికారి ప్రియదర్శిని మాట్లాడుతూ నేలస్వభావం, మొక్కకు అందిన పోషకాలు, సంరక్షణ కారణంగా ఇలా అరుదుగా ఎత్తు పెరుగుతాయన్నారు.

-ఈనాడు, పాలకొల్లు.

ఐటీఐల్లో ఖాళీ సీట్ల భర్తీకి నాలుగో విడత కౌన్సెలింగ్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐల్లో ఖాళీ సీట్ల భర్తీకి నాలుగో విడత కౌన్సెలింగ్ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ఐటీఐ కళాశాలల జిల్లా సమన్వయకర్త పి.రవిశ ఒక ప్రకటనలో తెలిపారు. https://iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు ధ్రువపత్రాలను ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా పరిశీలింపజేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 28న, ప్రైవేటు ఐటీఐల్లో దరఖాస్తు చేసుకున్న వారికి 30న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 08812-230269 నంబర్‌లో సంప్రదించాలని వివరించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కేజీ 1 రూపాయల్లో)

[illegible]

అధిక మోతాదులో మందులు మింగి మహిళ మృతి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: మానసిక రుగ్మతతో బాధపడుతున్న మహిళ భర్తతో గొడవపడి తాను వేసుకునే మందులను ఎక్కువ మోతాదులో మింగి మృతి చెందిన ఘటన ఆగిరిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఆగిరిపల్లి శివారు అమ్మవారిగూడెం తిప్పకు చెందిన రాసమేకల రాజగోపాల్, నాగదుర్గ(28) భార్యాభర్తలు. వారికి 9 ఏళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు కూతుళ్లు సంతానం. రాజగోపాల్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అయిదేళ్లుగా నాగదుర్గ మానసిక రుగ్మతతో బాధపడుతున్నారు. ఆమెకు మందులు వాడుతున్నారు. ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె తాను వాడే మందులను ఎక్కువ మోతాదులో మింగింది. అనంతరం అతను పనికి వెళ్లి సమయంలో తాను వాడే మందులు ఎక్కువ మోతాదులో మింగారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన భర్త అపస్మారక స్థితిలో ఉన్న నాగదుర్గను చూసి వెంటనే చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.30 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

భీమడోలులో ఉద్యోగ మేళా

భీమడోలు, న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పన సంయుక్త ఆధ్వర్యంలో భీమడోలులోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. మేళాకు 72 మంది అభ్యర్థులు హాజరుకాగా 16 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, రాము, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

24న నారాయణపురంలో.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: నారాయణపురంలోని శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యుడు టీకే విశ్వేశ్వరరావు తెలిపారు. మేళాకు సంబంధించిన గోడ పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా ఉపాధి, ఉద్యోగ కల్పన అధికారి ప్రవీణ్, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్వరం వస్తే అశ్రద్ధ చేయొద్దు


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న గోవిందరావు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: జ్వరం వస్తే అశ్రద్ధ చేయవద్దని, వైద్యులను సంప్రదించాలని మలేరియా అసిస్టెంట్ అధికారి గోవిందరావు అన్నారు. డీఎంహెచ్‌వో శర్మిష్ఠ ఆదేశాల మేరకు మంగళవారం ఆముదాల అప్పలస్వామి కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీల్లో 63 రకాల రక్త పరీక్షలు చేస్తున్నారని, టైఫాయిడ్, మలేరియా, డెంగీ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, మందులు కూడా ఉచితంగా ఇస్తారని తెలిపారు. వైద్యాధికారి నవ్య, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847	ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483	ఉంగుటూరు: 79933 00492

భీమడోలు, న్యూస్‌టుడే

సమస్య: గుండుగొలను బీసీ కాలనీ ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. మురుగునీరు ముందుకెళ్లే అవకాశం లేనందున ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. **- కె.రామకృష్ణ, గుండుగొలను**

సమాధానం: బీసీ కాలనీ ప్రాంతంలో వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతాం. డ్రెయిన్లలో పూడిక తీయిస్తాం. **- మురళీమోహన్, పంచాయతీ కార్యదర్శి**

గణపవరం, న్యూస్‌టుడే

సమస్య: చినరామచంద్రపురంలో తాగునీటి కుళాయిల ద్వారా బురదనీరు వస్తోంది. ఆ నీరు తాగడం అటుంచి వంట పాత్రలు శుభ్రం చేసేందుకూ ఉపయోగపడటం లేదు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని కోరుతున్నా. **- భార్గవి, స్థానికురాలు**

సమాధానం: ట్యాంకు వాచర్ కొత్తగా విధుల్లో చేరడంతో ఇబ్బందులు తలెత్తాయి. ట్యాంకులను పరిశీలించి ఆ ప్రాంత ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందించేలా చర్యలు తీసుకుంటాం. **- డీఎస్‌ఆర్ ప్రసాద్, ఈవో, గణపవరం**

కాలువలు శుభ్రం చేశారు.. ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: ఆముదాల అప్పలస్వామి కాలనీ వినాయకుడి గుడి రోడ్డులోని కాలువలను శుభ్రం చేశారు. మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదని ఈ నెల 16న ప్రచురితమైన వార్తకు నగర పాలక అదనపు అధికారి కె.శేషారెడ్డి స్పందించి సిబ్బందితో పనులు చేయించారు.

వీధి దీపాలు వెలిగాయి.. అశోక్‌నగర్ పాత ఆంధ్రా బ్యాంకు వీధిలోని వీధి దీపాలను వెలిగించారు. ఈ నెల 16న ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

దోమల మందు పిచికారీ.. అశోక్‌నగర్ కేబీడీటీ పాఠశాల వెనుక రోడ్డులోని కాలువల్లో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. ఈ సమస్యపై ఈ నెల 15న ప్రచురితమైన వార్తకు నగర పాలక సహాయాధికారి జి.చంద్రయ్య స్పందించి సిబ్బందితో పనులు చేయించారు.

నగరం.. ట్రాఫిక్ చట్రం

ఇబ్బందుల్లో వాహన చోదకులు


అగ్నిమాపక కేంద్రం కూడలిలో ఇలా..

పవరుపేట (ఏలూరు గ్రామీణ), న్యూస్‌టుడే: ఏలూరు నగరంలోని రహదారులు ఆక్రమణలకు గురవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోంది. తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతూ వాహన చోదకులు అవస్థలు పడాల్సి వస్తోంది. దుకాణాల నిర్వాహకులు నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలాలు చూపించాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా చోదకులు తమ వాహనాలను రోడ్లపై నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది.

ఏలూరు నగర పరిధిలో నిత్యం లక్షకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని అంచనా. నగర పరిసర ప్రాంతాల నుంచే కాకుండా నిత్యం చింతలపూడి, జంగారెడ్డిగూడెం, నూజివీడు తదితర ప్రాంతాలు, పక్కన ఉన్న కృష్ణా జిల్లా నుంచి జనం వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. ఫలితంగా నగరంలోని రహదారులు వాహనాలతో రద్దీగా ఉంటుంది. దుకాణదారులు పలువురు వ్యాపార నిమిత్తం రహదారులను ఆక్రమించి కాలువలపైన పక్కా కట్టడాలు నిర్మించారు.

ఎక్కడెక్కడంటే..

పవరుపేట రైల్వే స్టేషన్ సమీపం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి రహదారి, విజయ విహార్ కూడలి నుంచి పత్తేబాద, పవరుపేట వెళ్లే మార్గాలు, అగ్నిమాపక కేంద్రం కూడలి నుంచి అశోక్‌నగర్ వెళ్లే రహదారి, కొత్త బస్టాండ్ మార్గం, జూట్‌మిల్లు కూడలి నుంచి పాతబస్టాండు మీదుగా పెద్ద రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి, శాంతినగర్, సత్రంపాడు రోడ్లు, వన్ టౌన్‌లోని మెయిన్ బజారు, కెనాల్ రోడ్డు, చందనా బ్రదర్స్ రోడ్డు, తంగెళ్లమూడి కూడళ్లలో రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. కొందరు తమ వాహనాలను ఫుట్‌పాత్‌పై నిలుపుదల చేస్తుండటం గమనార్హం. ఇటీవల సీఆర్‌ఆర్ కళాశాల వద్ద ఫుట్‌పాత్‌ ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండడంతో అధికారులు వాటిని తొలగించారు.

ఇలా నగరంలోని అన్నిచోట్ల ఆక్రమణలు తొలగించడంతో పాటు నిబంధనల ప్రకారం దుకాణాల్లో సెల్లార్లు ఏర్పాటు చేయించడం, వాహనాలు నిలుపుదలకు అవసరమైన పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కనిపించని సెల్లార్లు

దుకాణదారులు తప్పనిసరిగా సెల్లార్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా దాదాపు 70 శాతం వాటికి లేవు. అలాగే రహదారులపై తోపుడుబండ్లు, మొబైల్ క్యాంటీన్లు నిర్వహిస్తున్నారు. ఫలితంగా వాహనదారులు తమ వాహనాల్ని రోడ్లపైనే నిలుపుతున్నారు. అసలే ఇరుకు దారులు.. ఆపై వాహనాలను ఆపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

ఈ విషయమై నగర ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ రహదారుల్లో అడ్డదిడ్డంగా నిలుపుతున్న వాహనాలను ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.


వెహికల్ షెడ్డు వద్ద నినాదాలు చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: నగరంలో చెత్త సేకరిస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లకు మూడు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సోమయ్య డిమాండ్ చేశారు. ఏలూరు వంగాయగూడెం కూడలిలోని వెహికల్ షెడ్డు వద్ద మంగళవారం క్లాప్ ఆటోడ్రైవర్లు ధర్నా చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సోమయ్య మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు పాటు పడుతున్న డ్రైవర్లకు సకాలంలో జీతాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్‌బాబు, నాయకులు రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌కు ఘన స్వాగతం

ఏలూరు వన్‌టౌన్, కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చారు. ఆయనకు ఆశ్రం ఆసుపత్రి కూడలి వద్ద నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు జన సైనికులతో కలిసి భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి జనసైనికులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండు, అగ్నిమాపక కేంద్రం కూడళ్లలో అప్పలనాయుడు క్రేన్ల సాయంతో భారీ గజమాలలతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నాదెండ్ల పవరుపేటలోని జనసేన పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. వీర మహిళలు తిలకం దిద్ది హారతులిచ్చారు. మంత్రికి స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, చిర్రి బాలరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, జనసేన నాయకులు నారా శేషు, కొఠారు ఆదిశేషు, నగర అధ్యక్షుడు కాశీ నరేష్, నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు ఉన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో తొలిసారి కలెక్టరేట్‌కు వచ్చిన మనోహర్‌కు జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, అధికారులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ వెంకటరమణ తదితరులు పుష్పగుచ్ఛాలు ఇచ్చారు.


మంత్రికి గజమాల వేస్తున్న జన సైనికులు, చిత్రంలో అప్పలనాయుడు


జనసేన నాయకులు, కార్యకర్తల బైక్ ర్యాలీ

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామి

రాట్నాలకుంట (పెదవేగి), న్యూస్‌టుడే: రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయ ఆవరణలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పలు గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

24న పీడీఎస్‌యూ శతాబ్ది ఉత్సవాలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పీడీఎస్‌యూ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాని పిలుపునిచ్చారు. ఉత్సవాల గోడ పత్రాలను మంగళవారం ఏలూరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఉత్సవాలను ఈ నెల 24న హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తారన్నారు. సంఘ నాయకులు ఎం.క్రాంతి, ఎ.శాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మేధో వికాసం

‘ఈనాడు’ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: నేటి ఆధునిక కాలంలో అంతర్జాలం ఎంతో విలువైన సాధనంగా మారింది. దీనివల్ల ఎన్ని ఉపయోగాలున్నాయో.. అలానే కొన్ని నష్టాలున్నాయి. అంతర్జాల సదుపాయంతో సామాజిక మాధ్యమాల ప్రభావం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై విద్యార్థులకున్న అవగాహనను తెలుసుకునేందుకు ‘ఈనాడు’ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్థానిక శ్రీరామ్ నగర్‌లోని శ్రీశ్రీ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో మంగళవారం ‘అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం’ అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. 8, 9, 10 తరగతుల బాలికలు, బాలురు పాల్గొన్నారు. విజేతలకు శ్రీశ్రీ విద్యాసంస్థల అధినేత ఎంబీఎస్ శర్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సీహెచ్ రామలక్ష్మి, జి.ప్రియదర్శిని, జి.సాగరకుమారి వ్యవహరించారు. పాఠశాల ఇన్‌ఛార్జి సీహెచ్ దివ్య పర్యవేక్షించారు.


వ్యాసరచన పోటీలో విద్యార్థులు


విజేతలతో పాఠశాల ప్రతినిధులు

విజేతలు వీరే:
ప్రథమ-కె. హేమేశ్ రామ్,
ద్వితీయ-బి. వినయ్‌బాబు,
తృతీయ- టి. పుష్కల

అర్హులందరికీ పథకాలు అందిస్తాం


కొనికిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదపాడు, న్యూస్‌టుడే: అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ‘మీకోసం- మీ చింతమనేని’ కార్యక్రమంలో భాగంగా కొనికి, సత్యవోలు గ్రామాల్లో మంగళవారం అధికారులు, నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. కొనికిలో జరిగిన సభలో మాట్లాడుతూ అయిదేళ్ల వైకాపా పాలనలో నియోజకవర్గంలోని గ్రామాల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. అనంతరం సత్యవోలులో పర్యటించిన ఆయన తెదేపా మండల అధ్యక్షుడు లావేటి శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రాంప్రసాద్, అనిల్, తహసీల్దారు కృష్ణజ్యోతి, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని వినతి

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనింద్రకొలనులో గాంధీ భవనం ఎదురుగా మద్యం గొలుసు, మాంసం దుకాణాల ఏర్పాటు ప్రయత్నాలను వెంటనే అడ్డుకోవాలని సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ముఖ్యమంత్రి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 2న గాంధీ జయంతి సందర్భంగా ప్రస్తుతమున్న మద్యం దుకాణం తొలగించాలని ప్రదర్శన చేశామన్నారు. మూర్తిరాజు ఉన్నతాశయంతో గాంధీ భవనం నిర్మించారని, ఇలాంటి దుకాణాలు ఏర్పాటుచేసి ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుమారు 70 సంవత్సరాల వయసున్న వృద్ధుడు మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఏలూరు జన్మభూమి పార్కు వద్ద అపస్మారక స్థితిలో ఉన్న ఇతన్ని రెండు నెలల కిందట పోలీసులు ఆసుపత్రిలో చేర్చారు. అతని వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

కోళ్ల వ్యర్థాల లారీలు స్వాధీనం

పెదపాడు, న్యూస్‌టుడే: కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తున్న రెండు లారీలను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు ఇన్‌ఛార్జి ఎస్సై కె.ఎస్.సతీష్ తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను మండలంలోని చేపల చెరువులకు తరలిస్తుండగా వసంతవాడ వద్ద పట్టుకున్నట్లు వివరించారు. లారీల యజమానులు, డ్రైవర్, క్లీనర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: నరసన్నపాలెం వై-జంక్షన్ సమీపంలో కోడి పందేల స్థావరంపై దాడిచేసి అయిదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. రూ.2,800, మూడు ద్విచక్ర వాహనాలు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరు!

అపసవ్య దిశలో ప్రయాణం


భీమడోలు వద్ద ఎదురుగా వస్తున్న వాహనదారులు

గుండుగొలను (భీమడోలు), న్యూస్‌టుడే: గ్రామంలోకి వెళ్లేందుకు దగ్గరి మార్గం అన్న ఆలోచనతో రాకపోకలు సాగిస్తూ పలువురు ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. 216ఏ జాతీయ రహదారిపై ప్రయాణం వాహనచోదకుల నిర్లక్ష్యంతో ప్రమాదకరంగా మారుతోంది. నిత్యం వేలాదిగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను తప్పించుకుంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. రహదారిని ఆనుకొని గ్రామాలు ఉండటంతో కూడళ్ల వద్ద వాహన చోదకులు అపసవ్య దిశలో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు.

గుండుగొలను బెయిలీ వంతెన, భీమడోలు కనకదుర్గ గుడి, కురెళ్లగూడెం కొండాలమ్మ గుడి ప్రాంతాల్లో రహదారి విభాజకాల్ని అపసవ్య దిశలో దాటుతున్నారు. ఈ విషయమై భీమడోలు ఎస్సై వై.సుధాకర్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. వాహన చోదకులు అపసవ్య దిశలో రాకపోకలు సాగించకుండా అవగాహన కల్పించడంతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.


గుండుగొలను వద్ద విభాజకం దాటుతూ..

ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ వద్దు


గుండుగొలను బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న రత్నప్రసాద్

గుండుగొలను (భీమడోలు), న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు కల్పించే వసతులు, అందించే ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ వద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. గుండుగొలను సమీకృత బాలికలు, భీమడోలు బాలికల వసతి గృహాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. గుండుగొలను వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరడంతో పక్కనున్న ఉన్నత పాఠశాల తరగతి గదుల్లో బాలికలకు వసతి కల్పిస్తున్నారు. అక్కడ మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో వాటికి తక్షణం మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యార్థులకు న్యాయ సాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని లేదా 15100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. వసతి గృహం వార్డెన్ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల పరిశీలన.. ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మంగళవారం ఏలూరు, కొవ్వలిలోని సాంఘిక సంక్షేమ, ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలోని శ్రీ సత్యసాయి అనాథ బాలికల వసతిగృహాలను తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, మంచినీటి సౌకర్యం తదితరాలను పరిశీలించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


గొల్లగూడెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గొల్లగూడెం, రాచూరు గ్రామాల్లో ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.1.35 కోట్లతో నిర్మించనున్న సీసీ రహదారులకు తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, భాజపా అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీరాణితో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. సర్పంచులు కరపా వెంకట శ్రీనివాస్, దారపురెడ్డి సీత, నాయకులు వేములపల్లి సుధీర్, దాసరి రాజశేఖర్, మంద శ్రీనివాస్ రెడ్డి, పారిచర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పత్తేపురంలో పల్లె పండగ

నిడమర్రు, న్యూస్‌టుడే: గ్రామాల్లో రహదారులకు మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పత్తేపురంలో మంగళవారం జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో ఆయన పాల్గొని రూ.65 లక్షలతో నిర్మించే సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జనసేన నాయకులు చింతలపాటి బాచిరాజు, వంగా రఘు, వాసురాజు, గ్రామ సర్పంచి నీలపాల సాయిప్రియ, ఉప సర్పంచి రుద్రరాజు కొండ్రాజు, ఉంగుటూరు నియోజకవర్గ భాజపా కన్వీనర్ మాలతీరాణి, జనసేన నిడమర్రు మండల అధ్యక్షుడు నిమ్మల దొరబాబు, అధికారులు పాల్గొన్నారు.


కోడూరుపాడులో సభ నిర్వహిస్తున్న అధికారులు

రీసర్వేపై అభ్యంతరాల స్వీకరణ

భీమడోలు, న్యూస్‌టుడే: కోడూరుపాడులో పూర్తిస్థాయిలో రీసర్వే పూర్తయిన నేపథ్యంలో అభ్యంతరాలు స్వీకరించేందుకు అధికారులు మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో 538 భూకమతాలకు 1,201 ఎకరాల విస్తీర్ణం ఉంది. ప్రజల నుంచి రెండు ఫిర్యాదులొచ్చాయి. సర్పంచి మానుకొండ వెంకటేశ్వరరావు, తహసీల్దారు రమాదేవి, సర్వేయర్ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

‘ఉచిత బస్సు సౌకర్యం హామీ అమల్లో విఫలం’


పోస్టు కార్డుపై చిరునామా రాయిస్తున్న రామ్మోహనరావు, నాయకులు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం హామీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు ఆరోపించారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పిలుపు మేరకు ఏలూరు కొత్త బస్టాండులో ప్రయాణికులను కలిసి వారి పేరిట ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు పంపించే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచినా సూపర్ 6 హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం హామీని అమలు చేయలేదన్నారు. బ్లాక్ వన్ కాంగ్రెస్ అధ్యక్షుడు లంక రామ్మోహన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రంగబాబు, దండుబోయిన చంద్రశేఖర్, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సినిమాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	**లవ్ రెడ్డి**
అంబిక మినీ	**రామనగర్ బన్నీ**
సాయిబాలాజీ	**మా నాన్న సూపర్ హీరో**
బాలాజీ	**శ్వాగ్**
సత్యనారాయణ స్క్రీన్ 1	**విశ్వం**
సత్యనారాయణ స్క్రీన్ 2	**వేట్టయన్**
సత్యనారాయణ స్క్రీన్ 3	**వేట్టయన్**
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	**దేవర**
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	**ఇద్దరు**
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	**డీల్**
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	**వేట్టయన్**
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	**వేట్టయన్**
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	**విశ్వం**
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	**విశ్వం**

అవి ఇవి అన్నీ

తెలుగు అధ్యయన సామగ్రి అందజేత.. పెదపాడు, న్యూస్‌టుడే: పెదపాడు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం తెలుగు అధ్యయన సామగ్రి అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు తెలిపారు. పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు యూవీ సత్యనారాయణ ఆర్థిక సాయంతో వీటిని అందజేశామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం.. నిడమర్రు గ్రామీణ, న్యూస్‌టుడే: నిడమర్రు మండల పరిషత్తు సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, గ్రామ, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

తూర్పు కాపు పరిరక్షణ కమిటీ సమావేశం.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు పట్టణ తూర్పు కాపు పరిరక్షణ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రస్తుత కమిటీ కార్యవర్గం కాల పరిమితి ముగిసినందున నూతన కార్యవర్గాలను నియమించాలని సభ్యులు నిర్ణయించారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి.. పెదవేగి, న్యూస్‌టుడే: ప్రభుత్వ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఆర్‌బీ ఏవో శాంతి అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురం, పెదవేగి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తోందని శాంతి తెలిపారు. ఉద్యాన పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను ఉద్యాన శాఖ హెచ్‌వో రత్నమాల వివరించారు. మండల వ్యవసాయాధికారి ముత్యాల ప్రియాంక, సెరికల్చర్ సాంకేతిక సహాయ అధికారిణి కుమారి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక.. గణపవరం, న్యూస్‌టుడే: గోపన్నపాలెంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో గణపవరం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎంఎస్‌వీఎన్ మూర్తి తెలిపారు. అండర్-14 80 మీటర్ల హర్డిల్స్‌లో అఖిల్, అండర్-17 అయిదు కిలోమీటర్ల నడకలో యశ్వంత్, సురేష్, ధనుష్‌లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులతో పాటు పీడీ పద్మావతిని పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.



ఆంగ్లంపై పట్టు సాధిస్తే అన్ని రంగాల్లో రాణింపు.. గణపవరం, న్యూస్‌టుడే: గణపవరంలోని శ్రీచింతలపాటి వరప్రసాద మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లక్ష్య నిర్దేశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడారు. విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్‌రావు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఆంగ్లంపై పట్టు సాధిస్తే అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉందన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి.. ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ఏపీ ఎన్‌జీవో సంఘం నాయకులు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. మంగళవారం ఏలూరు వచ్చిన ఆయనను సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి కె.సత్యనారాయణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

కొలువుల మంజూరుకు వినతి.. ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఏలూరు నగర పాలక ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్ కొలువులు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. సంఘ నాయకులు ఆనంద్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు ఏలూరు ఎంఈవో రవిప్రకాశ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ కొలువులు మంజూరు చేయాలని, ప్రాథమికోన్నత బడుల్లో పనిచేసే ఉపాధ్యాయులకు జీపీఎఫ్ ఖాతాలు తెరవాలన్నారు.

పోలవరం

•పోలవరం • చింతలపూడి

మద్ది ఆంజనేయునికి విశేష పూజలు



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్ది ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి 108 ప్రదక్షిణలు చేయడంతో పాటు తమలపాకుల పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. పూజా టిక్కెట్లు, ప్రసాదాల ద్వారా రూ.1.39లక్షల ఆదాయం సమకూరిందని ఈవో ఆర్వీ చందన తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న శ్రీరాములు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: తపన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బచ్చులేటిగూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని స్థానిక పెద్ద కాళ్ళీడి శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ మూడు నెలల పాటు కొనసాగుతుందన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకుని స్వశక్తితో ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జట్ల రాంబాబు, సత్రం రాజు, కురసం రామచంద్రరావు పాల్గొన్నారు.

ప్రతిభ మెరిసి.. సృజన విరిసి!

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా జంగారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత, సూర్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో 'ఇంటర్నెట్‌తో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో ప్రథమ స్థానంలో కోట నిధి, ద్వితీయ జి.భాష్యశ్రీ, తృతీయ స్థానాల్లో వి.సాయి దీప్తి సహస్ర నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని లోవకుమారి బహుమతులు అందజేశారు. అలాగే సూర్య పాఠశాలలో నిర్వహించిన పోటీలో ప్రథమ పి.జయనాగ శిరీష, ద్వితీయ పి.రమ్యశ్రీ, తృతీయ స్థానాల్లో కె.షణ్ముఖ్ నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ కరుటూరి రమాదేవి బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జంగారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని లోవకుమారి తదితరులు



సూర్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న రమాదేవి

మరమ్మతులకు నిధులు.. తప్పనున్న తిప్పలు!

పోలవరం, న్యూస్‌టుడే

వచ్చే జనవరి నాటికి రోడ్లపై ఎక్కడా గుంతలు కనిపించ కూడదని ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుకు వెళ్లే మార్గంతో పాటు మండలంలోని గిరిజన గ్రామాల మీదుగా వెళ్లే ర.భ.శాఖ రహదారులు గోతులమయం కావడంతో ప్రజలు, ముఖ్యంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.4.15 కోట్లతో 10.50 కిలోమీటర్ల పొడవునా దేవరగొంది నుంచి రేపల్లెవాడ వరకు అదిగో రోడ్డు వేస్తున్నాం.. ఇదిగో అంటూ కాలం గడిపేశారు. టెండర్ ప్రక్రియలో లోపాల కారణంగా ఆ పనులు రద్దయ్యాయి. ఏమాత్రం చినుకు పడినా గోతుల్లో నీరు నిలిచి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. కొత్త వారు ఎవరైనా అటుగా వస్తే ప్రమాదానికి గురవుతున్నారు.



దేవరగొంది సమీపంలో గోతుల రోడ్డుపై ప్రయాణం



పట్టిసీమ ఎత్తిపోతల పథకం సమీపంలో..

మూడు కిలోమీటర్లు అరగంట ప్రయాణం

కన్నాపురం కూడలి నుంచి పోలవరం వరకు మూడు కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడ గోతులు పడ్డాయి. పోలవరం ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో స్థానికులతో పాటు అధికారులు రాకపోకలు సాగించేందుకు నిత్యం నరకం చూస్తున్నారు. మూడు కిలోమీటర్ల ప్రయాణానికి అరగంటపైనే సమయం పడుతోంది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఎదురుగా రెండేళ్ల కిందట రూ.25 లక్షలతో వేసిన తారు రోడ్డు దెబ్బతింది. దీంతో ఒకవైపుగా వాహనాలు వెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో తరచూ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారుల దుస్థితిని ర.భ.శాఖ డీఈ హరికృష్ణ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా. . గోతులు పూడ్చేందుకు కూటమి ప్రభుత్వం రూ.18 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

10 AM to 1 PM వేమన్నా.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం : 80085 74478
కొయ్యలగూడెం : 80085 74947
చింతలపూడి : 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: చింతలపూడి మండలం రాఘవాపురం ఎస్సీ కాలనీలో నివాసాల మధ్య మురుగు నిలుస్తోంది. దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. **- అక్షయ్, స్థానికుడు**

సమాధానం: నివాసాల మధ్య మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. దోమల నివారణకు మందు పిచికారీ చేస్తాం. **- మురళీకృష్ణ, ఎంపీడీవో, చింతలపూడి**

ఆధార్ శిబిరం తనిఖీ

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాన్ని ఇన్‌ఛార్జి ఎంపీడీవో కె.శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. అధిక రుసుములు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందికి సూచించారు.



ప్రమాదకరంగా సిమెంటు రహదారి

కొయ్యలగూడెం గ్రామీణ న్యూస్‌టుడే: కన్నాపురం సుబ్రహ్మణ్యేశ్వర ఆలయానికి వెళ్లే మార్గాన్ని కలుపుతున్న సిమెంట్ రహదారి మలుపులో ధ్వంసమైంది. వాహన చోదకులు, పాదచారులు రాత్రి వేళల్లో అంచనా వేయలేక అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

పోలీసుల సేవలు మరువలేనివి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: సమాజంలో పోలీసుల సేవలు మరువలేనివని సీఐ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులను స్మరించుకోవడం అందరి బాధ్యతని అన్నారు. సమయంతో సంబంధం లేకుండా విధులు నిర్వర్తించే ఉద్యోగం తమదేనన్నారు. శాంతి భద్రతలు కాపాడటంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, ఎస్సై నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: సమాజ సేవకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని ఎస్సై ఎం.జయబాబు అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా టి.నరసాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు వివరించారు. పోలీసులు ప్రజల మిత్రులని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై జయకుమార్, ప్రధానోపాధ్యాయుడు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: వేప కషాయం, నూనె వంటి వాటితో మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉద్ధృతిని అరికట్టవచ్చని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. రాజానగరం, కామయ్యకుంట గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న, వరి, అపరాల పంటలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పురుగులను నశింపచేసే టిక్కీ ట్రాప్‌లు అందజేశారు. శాస్త్రవేత్తలు వి.దీప్తి, పి.విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని రంగాపురంలో వ్యవసాయాధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పంట సాగులో అధిక దిగుబడుల సాధనకు సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచి ముసునూరి రాము, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కషాయాలతో కత్తెర పురుగు నివారణ



బుట్టాయగూడెం: రైతుకు టిక్కీ ట్రాప్ అందజేస్తున్న ఏవో ముత్యాలరావు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి ప్రభుత్వం అందిస్తోన్న రాయితీలు, ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రీనివాసన్ అన్నారు. అచ్యుతాపురంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. సర్పంచి మద్దిపాటి నాగరత్నం, పలువురు రైతులు పాల్గొన్నారు.

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలానికి దగ్గరలో తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉన్న మిల్లులకు ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారికి రైతులు విజ్ఞప్తి చేశారు. గూటాల, కొత్తపట్టిసీమ రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం వ్యవసాయశాఖాధికారి కె.రాంబాబు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాళ్లపూడి, నిడదవోలు మిల్లులకు ధాన్యం పంపే అవకాశం కల్పించాలన్నారు. మొక్కజొన్న విత్తనాలు రాయితీ అందజేయాలని కోరారు.

గిరిజన సంక్షేమ ఈఈగా లత



బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్‌పురం ఐటీడీఏలో గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా టి.లత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ప్రధాన కార్యాలయంలో డీఈగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. బుట్టాయగూడెం డీఈగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డేవిడ్‌రాజు పదోన్నతిపై ఈఈగా పాడేరు బదిలీ అయ్యారు.

బొర్రంపాలెం కార్యదర్శిగా నాగేశ్వరరావు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బొర్రంపాలెం పంచాయతీ కార్యదర్శిగా పగడం నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు బొర్రంపాలెంలో పనిచేసిన శ్రీనివాస్‌కృష్ణ తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకు బదిలీ అయ్యారు.

ట్యాంక్ పరిసరాలు శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

వేలేరుపాడు, న్యూస్‌టుడే: తాట్కూరుగొమ్ము పంచాయతీ వసంతవాడలో తాగునీటి ట్యాంక్ వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా మారిన వైనంపై ఈ నెల 20న 'ఈనాడు'లో 'ఇదేనా శుభ్రత' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నీరు నిల్వ ఉండకుండా పూడిక తీయించారు. పరిసరాల్లోని పొదలను తొలగించి శుభ్రం చేయించారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో పట్టణానికి చెందిన ఎం.తన్మయి అండర్-17 విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ఛైర్మన్ మద్దిపాటి చైతన్య అభినందించారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అధిక ధరలకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు దుకాణదారులను మంగళవారం హెచ్చరించారు. గొలుసు దుకాణాలు ఏర్పాటు చేసినా చర్యలు ఉంటాయన్నారు. సర్కిల్ పరిధిలో 16 దుకాణాల ఏర్పాటు తుది దశకు చేరిందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నాటుసారా, మద్యం అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయాలు, బెల్లపు ఊట ధ్వంసం తదితరాలకు సంబంధించి ఇప్పటి వరకు 439 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

దుకాణం మార్పు

లింగపాలెం, న్యూస్‌టుడే: స్థానిక దళితవాడ సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని మార్చాలంటూ స్థానికులు చేస్తోన్న ఆందోళనకు ఎక్సైజ్ అధికారులు స్పందించారు. దుకాణాన్ని దళితవాడకు దూరంగా మంగళవారం మార్చినట్లు చింతలపూడి ఎక్సైజ్ సీఐ అశోక్ తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: నరసన్నపాలెం వై-జంక్షన్ సమీపంలో కోడి పందేల స్థావరంపై దాడిచేసి అయిదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. రూ.2,800, మూడు ద్విచక్ర వాహనాలు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నాటు సారా పట్టివేత

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: అంకాలగూడెంలో సారా కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. నిందితుల నుంచి 50 లీటర్ల సారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బెల్లపు ఊట ధ్వంసం

చింతలపూడి, న్యూస్‌టుడే: మండలంలోని నామవరం గ్రామ అటవీ ప్రాంతంలో మంగళవారం నాటు సారాకు ఉపయోగించే వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి, ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వైవీఎస్ఎస్ ఫణికుమార్ తెలిపారు.

భవనాలు పూర్తికాక.. ఇబ్బందులు తొలగక!



బొర్రంపాలెంలో నిలిచిన సచివాలయం-2 భవనం పనులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ కాలంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భవన నిర్మాణాలకు ఎన్నికల ముందే నిధులు నిలిచిపోవడంతో ఆయా పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. దీంతో ఉద్యోగులు తమ విధులను అందుబాటులో ఉన్న పాత భవనాల్లో కొనసాగిస్తున్నారు. అవి శిథిలావస్థకు చేరడం, వర్షాలకు కారుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు సైతం అసౌకర్యానికి గురౌతున్నారు. టి.నరసాపురం మండలంలోని 15 పంచాయతీల్లో సచివాలయాలు(17), రైతు సేవా కేంద్రాలు(17), గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు(15) భవనాలు మంజూరయ్యాయి. సచివాలయాలకు రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రాలకు రూ.21.8 లక్షలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు రూ.20.8 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించింది. మొత్తం 49 భవనాలకు 24 మాత్రమే గత ప్రభుత్వం పూర్తి చేసింది.

మిగిలిన 25 ఇక్కడే.. బొర్రంపాలెం, టి.నరసాపురం, ఏపీగుంట, వల్లంపట్ల, రాజుపోతేపల్లి తదితర గ్రామాల్లో సచివాలయాలు, మరి కొన్ని గ్రామాల్లో రైతుల సేవా కేంద్రాలు, ఇంకొన్ని గ్రామాల్లో గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలు లేవు. నిర్మాణంలో ఉన్న 25 భవనాల్లో కొన్ని మధ్యస్థం, మరికొన్ని చివరి దశ పనుల్లో ఊగిసలాడుతున్నాయి. ఈ ప్రభుత్వం వాటిపై దృష్టి సారించి నిధులు మంజూరు చేసి, పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. 'పనులు నిలిచిపోయిన భవన నిర్మాణాల గురించి ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కాగానే పూర్తి చేస్తాం'అని పంచాయతీరాజ్ ఏఈ సంపత్‌కుమారి తెలిపారు.



తిరుమలదేవిపేటలో గ్రామీణ ఆరోగ్య కేంద్రం..

పోలవరంలో భారీ వర్షం



పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలంలో రెండ్రోజులుగా సాయంత్రం అయ్యేసరికి కుండపోత వర్షం కురుస్తోంది. మంగళవారం సాయంత్రం రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి పోలవరం ప్రధాన రహదారిపై నీరు నిలిచింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందుతున్నారు.

కొండ వాగుల ఉద్ధృతి.. మండలంలోని అటవీ ప్రాంతంలో కురిసిన కుండపోత వర్షానికి వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. సున్నాలగండి, మెత్తప్పకోట మీదుగా వాగుల నీరు ఇసుక కాలువలో కలిసి అక్కడి నుంచి పోలవరంలోని కడెమ్మ అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి వెళుతోంది. వరద పూర్తిగా తగ్గడంతో వచ్చిన నీరు వచ్చినట్లు నదిలోకి వెళ్లిపోతుండటంతో రైతులు ఊరట చెందుతున్నారు. పోలవరం తహసీల్దార్ కార్యాలయంలో 9.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



కడెమ్మ కాలువలో ప్రవాహం

'సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు'

జంగారెడ్డిగూడెం, చింతలపూడి పట్టణం, పోలవరం, బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోరుతూ జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన ధర్నా మూడో రోజైన మంగళవారం కూడా కొనసాగింది. ఆసుపత్రి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణరాజు, నాయకులు కుంచె వసంతరావు, గొలిమే బాలయేసు తదితరులు పాల్గొన్నారు. ★ చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బాబు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ★ పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో కార్మికులు ప్లకార్డులు చేతబట్టి ధర్నా చేశారు. ★ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం తగదని ఇప్టు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ అన్నారు. బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రం పారిశుద్ధ్య కార్మికులకు ఆయన మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రి వద్ద కార్మికుల ధర్నా

చిన్నవేంకన్న క్షేత్రంలో మాక్‌డ్రిల్



ఆలయంలోకి ప్రవేశిస్తున్న అక్టోపస్ బలగాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ముఖాలకు మాస్కులు కట్టుకుని పలువురు గుర్తు తెలియని వ్యక్తులు ద్వారకాతిరుమల చిన్నవేంకన్న ఆలయాన్ని చుట్టుముట్టారు. ఉగ్రవాదులేమోనని భక్తులు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపటికి తుపాకులతో అక్కడకు చేరుకున్న అక్టోపస్ బలగాలు రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టాయి. తీరా అది మాక్‌డ్రిల్ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆలయాల్లో ఉగ్రవాదులు అకస్మిక దాడులకు యత్నిస్తే భక్తులను ఎలా రక్షించాలి, దేవాలయాల ఆస్తులను ఎలా కాపాడాలనే అంశంపై మంగళవారం అక్టోపస్ బలగాలు చిన్నవేంకన్న ఆలయంలో మాక్‌డ్రిల్ నిర్వహించాయి. ఆలయ ఇంజినీర్ అధికారులు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

అంతర్గత దారులు నిర్మించాలని వినతి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మండలం రేచర్లలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని కోరుతూ సీపీఐ నాయకులు పంచాయతీ కార్యదర్శి కుమార్‌కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు దొంత కృష్ణ మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయన్నారు. వర్షం పడితే చిత్తడిగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటేశ్వరరావు, దాసు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నర్సమాంబ అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు 'పరిసరాల పరిశుభ్రత'పై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో నాటిన అరటి, బొప్పాయి ఇతర పండ్ల మొక్కల పెంపక విధానం, సస్యరక్షణ చర్యలపై స్కౌట్ ఉపాధ్యాయుడు పులకండం భాస్కరరావు వివరించారు. అలాగే పాఠశాలలోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అరటి మొక్కల పెంపకంపై వివరిస్తున్న ఉపాధ్యాయుడు

దాడి చేసి, చంపుతామని బెదిరించిన వారిపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, కొట్టి గాయపర్చిన వారిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఏఎస్సై మంగయ్య కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురానికి చెందిన తమర్చి మోషేకు.. అదే గ్రామంలో అతడి ఇంటి వెనుక ఉంటున్న మాదాసు మంగరాజుకు మధ్య పాత గొడవలున్నాయి. ఈ విషయమై ఈ నెల 18న గ్రామ పెద్దల వద్ద పంచాయితీ పెట్టారు. అదే రోజు మంగరాజు మరో 12 మంది కలిసి మోషే ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి కర్రలు, ఇనుప రాడ్లతో అతడిపై దాడి చేశారు. కేకలు వేయడంతో ఇంటిలో నుంచి బయటకు వచ్చిన మోషే భార్యను సైతం కొట్టి చంపుతామని బెదిరించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేరుకుపోతున్న చెత్త కుప్పలు!

పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. వీధులలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు ఉన్న రెండు కాంపాక్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ట్రాక్టర్లు ఉపయోగిస్తున్నారు. వాహనాల సమస్యతో వ్యర్థాల తరలింపు ఆలస్యమవుతోంది. ఈ కారణంగా వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. కాంపాక్టర్లకు మరమ్మతులు చేయిస్తున్నామని కమిషనర్ కేవీ రమణ తెలిపారు.



సుబ్రహ్మణ్యస్వామి గుడి వీధిలో చెత్తను ట్రాక్టర్‌లో ఎగుమతి చేస్తున్న కార్మికులు

- న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం

'ఉద్యోగ నియామకాల చట్ట సాధనకు ఉద్యమం'

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతాల్లో ఉద్యోగ నియామకాల చట్ట సాధనకు ఆదివాసీలు ఉద్యమించాలని ఐకాస జిల్లా ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద కొమరం భీం, ఆదివాసీల ఆత్మబంధు ఎస్ఆర్ శంకరన్‌ల జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరిరువురూ ఆదివాసీల అభ్యున్నతికి చేసిన త్యాగాలను పలువురు వక్తలు వివరించారు. కురసం దుర్గారావు, కాకి మధు, కొవ్వాసు శ్రీనివాసరావు, నీలయ్య, శిరమయ్య పాల్గొన్నారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: ఆదివాసీ గిరిజన హక్కుల కోసం పోరాడిన కొమరం భీం ఆశయాలను కొనసాగిస్తామని పలువురు గిరిజన పెద్దలు అన్నారు. కొమరం భీం జయంతిని మంగళవారం మర్రిగూడెంలో ఘనంగా నిర్వహించి, ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాన్ని మద్యం రహితంగా చేస్తామని తీర్మానించారు. ఇకపై ఎవరైనా విక్రయాలు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పొట్టా రామారావు, కురసం నిరీక్షణరావు, కుంజా లోకేశ్, ఆదిత్య, నాగేశ్వరరావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



కొమరం భీం, శంకరన్‌ల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


పోటీలను పరిశీలిస్తున్న ఎస్సై వీరభద్రరావు

పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ముదినేపల్లి సహాయమాత పాఠశాల విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వీరభద్రరావు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం అన్నారు. పోలీసు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం తగదు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: వసతిగృహంలో ఉంటున్న విద్యార్థులపై నిర్లక్ష్యం వహించొద్దని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ వీవీఎన్‌వీ.లక్ష్మి అన్నారు. ముదినేపల్లిలోని బీసీ బాలుర, బాలికల వసతిగృహాన్ని మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, భోజనానికి వినియోగిస్తున్న సరకులు, మంచినీటి సౌకర్యం, వసతులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యం, వసతిలో జాగ్రత్త వహించాలని, వారికి చక్కటి భవిత అందించాలని సూచించారు.


తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి లక్ష్మి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు : 99486 40551	కైకలూరు: 73060 88555
ముసునూరు : 93983 81268	కలిదిండి: 90594 84862

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని నత్తగుళ్లపాడు రామాలయం ఎదురుగా సిమెంటు రోడ్డుపై మురుగు పారుతోంది. స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. **- మోహన్, నత్తగుళ్లపాడు**

సమాధానం: వెంటనే డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరిచి సమస్య పరిష్కరిస్తాం. **- కె.రవికిరణ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి**

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: ముసునూరులో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి. రాత్రి వేళల్లో బయటకు రావాలంటే భయ పడేలా పరిస్థితులున్నాయి. చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- విజయ్, స్థానికుడు**

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. **- వెంకటేశ్వరరావు, కార్యదర్శి**

ముదినేపల్లి, న్యూస్‌టుడే

సమస్య: గురజలో కమ్యూనిటీ భవనం వద్ద సిమెంట్ రహదారిపై మురుగు నీరు నిలిచిపోతుంది. దీనివల్ల దుర్వాసన వెదజల్లుతోంది. వ్యాధులు వ్యాప్తి చెందుతాయని భయంగా ఉంది. కచ్చా డ్రెయిన్ తవ్వి మురుగు పారేలా చర్యలు తీసుకోవాలి. **- మోహన్‌బాబు, గురజ**

సమాధానం: వెంటనే సిబ్బందిని పంపి మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం. **- జి.రమేశ్, పంచాయతీ కార్యదర్శి**

మండవల్లి, న్యూస్‌టుడే

సమస్య: మండవల్లిలో పలు కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. దీంతో అంతర్గత సిమెంటు రోడ్లపై మురుగు నీరు పారుతోంది. ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. **- రామ్మోహన్, మండవల్లి**

సమాధానం: డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పరిచి మురుగునీరు మరలించేలా చర్యలు తీసుకుంటాం. **- కొండలు, పంచాయతీ ఈవో**

దూసుకెళ్తూ.. ప్రమాదాల బారిన పడుతూ..

• వేగ నియంత్రణ పట్టని మైనర్లు • ద్విచక్ర వాహనాలపై ఇష్టానుసారంగా చక్కర్లు

● రెండు నెలల కిందట కైకలూరు మండలం వేమవరప్పాడులో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తూ రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టరును ఢీకొని ఇరువురు ప్రాణాలు కోల్పోయారు. శిరస్త్రాణం ధరించి ఉంటే ప్రాణాలు నిలిచేవని స్థానికుల అభిప్రాయం.

● ఆరు నెలల కిందట ఇద్దరు విద్యార్థులు కైకలూరు పోలీస్‌స్టేషన్ ముందు రోడ్డు పక్కన నిద్రిస్తున్న ఆవులను ద్విచక్ర వాహనంతో వేగంగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో విద్యార్థులకు గాయాలయ్యాయి. ఒక ఆవు మృతి చెందగా మరో ఆవు తీవ్రంగా గాయపడింది.

కైకలూరు, న్యూస్‌టుడే: మారుతున్న కాలానికి తగ్గట్టు ద్విచక్ర వాహనాల సంస్థలు అనేక రకాల వాహనాలను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. దీంతో కన్నుమూసి తెరిచే లోపు దూసుకుపోయే వాహనాల వినియోగం గ్రామీణ ప్రాంతాల్లోనూ పెరిగింది. అయితే ఈ రకం బండ్లను ఈ మధ్య కాలంలో మేజర్ల కంటే మైనర్ల చేతిలోనే ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. తరచూ ఏదో ప్రమాదంలో మైనర్లు భాగస్వామ్యమవుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.



అప్పులు చేయించి మరి

నేటి యువతరం సైతం వీటిపై మోజు పెంచుకుంటూ తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టి అప్పులు చేయించి ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయిస్తున్నారు. ఇక్కడ వరకు కొంత బాగానే ఉన్నా మైనర్లకు వాహనాల వేగ నియంత్రణపై కనీస అవగాహన లేక రోడ్లపై ఇష్టానుసారంగా దూసుకుపోతున్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోగా కనీసం శిరస్త్రాణాలు సైతం ధరించకుండా ప్రాణాలతో ఆటలు ఆడుతున్నారు. అనుకోని పరిస్థితుల్లో ప్రమాదాల బారిన పడుతూ కన్నవారికి గర్భ శోకం మిగుల్చుతున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు(మైనర్లు) అధికంగా ఉండటం అందరిని ఆలోచనలో పడేస్తోంది.

అవగాహన కల్పిస్తున్నా..

ఇటీవల పోలీసు శాఖతో పాటు న్యాయ సేవాధికార సంస్థ సైతం రోడ్డు భద్రతా నియమాలపై అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ద్విచక్ర వాహనాలు నడిపే మైనర్లను పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ సైతం ఇస్తున్నారు. కొందరికి అపరాధ రుసుములు విధిస్తున్నారు. అయినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రావడం లేదు. కొందరు తల్లిదండ్రుల మాటను వినకపోవడం.. మరికొందరు పిల్లలకు సరైన సూచనలు ఇవ్వడం లేదు.


వైద్య సేవలందిస్తున్న ప్రశాంతి

భవిత కేంద్రంలో దివ్యాంగులకు చికిత్స

ముసునూరు, న్యూస్‌టుడే: రమణక్కపేట మండల ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరపీ వైద్యురాలు జి.ప్రశాంతి శిబిరం నిర్వహించారు. దివ్యాంగులైన చిన్నారులతో వ్యాయామం చేయించారు. తల్లిదండ్రులు ఇంటి వద్ద చేయించే వ్యాయామాలను నేర్పించారు. శిబిరంలో ఐఈఆర్టీలు డీఎంవీ లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

ముసునూరు, ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: ముసునూరులో ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 మద్యం సీసాలను మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు ఏలూరు ఎక్సైజ్ సీఐ వైవీఎన్ఎస్ ఫణికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన అనగాని సీతామహాలక్ష్మి అనే మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● చాట్రాయి మండలం పోతనపల్లిలో నాటు సారా తయారీ కేంద్రంపై దాడి చేసి 1600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. 50 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. నామవరంలో 1000 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేశారు. ముసునూరులో ఇద్దరి వద్ద అక్రమంగా ఉన్న 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారానికి మంత్రి చొరవ

ముసునూరు, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి పనులకు కృషి చేస్తున్నారని తెదేపా నాయకుడు ఉప్పలపాటి గణేశ్ అన్నారు. మంగళవారం ముసునూరు మండలం గోపవరంలో కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. గోపవరం, పెద్దపాటివారిగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, శ్మశాన వాటిక అభివృద్ధి, తాగునీరు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించారన్నారు. గ్రామాల్లో నెలకొన్న ఇతర సమస్యలపై నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న తెదేపా నాయకులు

ముఖ్యమంత్రి సహాయ నిధితో భరోసా: ముద్దరబోయిన

నూజివీడు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధితో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చంద్రబాబు నాయుడు భరోసా కల్పిస్తున్నారని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని ఆయన కార్యాలయంలో మంగళవారం సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వంలో సీఎం సహాయ నిధి రాకపోవడంతో అనేక మంది రోగులు వైద్యం చేయించుకోవడానికి అవస్థలు పడ్డారని అన్నారు. కూటమి ప్రభుత్వం రోగులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. దేవరగుంటకు చెందిన పలనాటి నరసింహారావుకు రూ.45,667, బోర్వంచకు చెందిన మహమ్మద్ రాబియా సుల్తానాకు రూ.63,071 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. తెదేపా సభ్యత్వ నమోదును వేగవంతం చేసి నూజివీడును రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.


బాధితులకు చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

శుభ్రం చేశారు

ఈనాడు కథనానికి స్పందన

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం రమణక్కపేట శివారులో రహదారుల పక్కన చెత్త పేరుకుపోయి మురికి కూపాలుగా మారాయి. దీనిపై సోమవారం 'ఈనాడు'లో 'పడకేసిన పారిశుధ్యం' శీర్షికన వార్త ప్రచురితమైంది. దానిపై పంచాయతీ కార్యదర్శి నాగబాబు మంగళవారం స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో చెత్త తొలగింపజేశారు. బ్లీచింగ్ చల్లించారు.

26న మండల సమావేశం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 26న మధ్యాహ్నం 2 గంటలకు మండల ప్రజా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గొల్ల అనూష అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.భార్గవి మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

ఉపాధ్యాయుల అభ్యున్నతే యూటీఎఫ్ లక్ష్యం

నూజివీడు, న్యూస్‌టుడే: యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకను నూజివీడులోని చిన్న గాంధీ బొమ్మ కూడలిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యూటీఎఫ్ పనిచేస్తోందని, 50 ఏళ్లలో అనేక పోరాటాలు చేసి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. నాలుగు, అయిదు తరగతులను ప్రాథమిక విద్యలో కలపాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముస్తాఫ్ అలీ, జి.వెంకటేశ్వరరావు, ఆర్.రవికుమార్, బి.సుభాషిణి, బాబూరావు, వెంకటేశ్వరరావు, ఎంపీపీ కె.శిరీష, జడ్పీ వైస్ ఛైర్మన్ జి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


నాయకుల ప్రదర్శన

పరిశ్రమల సందర్శనతో ఆచరణాత్మక పరిజ్ఞానం

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు పరిశ్రమల సందర్శనతో ఆచరణాత్మక పరిజ్ఞానం పొందవచ్చని, భవిష్యత్తు, పరిశోధన, ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంపొందించేందుకు తోడ్పడుతుందని హెచ్‌వోడీ శ్రావణి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలోని ఈఈఈ విభాగం తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం థర్మల్ పవర్‌స్టేషన్, కిన్నెరసాని ప్రాజెక్టులను సందర్శించారు. పరిశ్రమల సందర్శనలో విద్యార్థులకు విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థ, ప్రాజెక్టుల నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించారు.


థర్మల్ పవర్‌స్టేషన్ వద్ద ట్రిపుల్ ఐటీ విద్యార్థులు


మనోహర్, ఎమ్మెల్సీ వెంకటరమణ ఆత్మీయ ఆలింగనం

మంత్రిని కలిసిన నేతలు

కైకలూరు, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఏలూరు వచ్చిన మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కైకలూరు జనసేన నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. త్వరలోనే కైకలూరు పర్యటనకు వస్తానని మంత్రి చెప్పినట్లు జనసేన నేత కొల్లి వరప్రసాద్ తెలిపారు. నాయకులు తోట లక్ష్మి, తులసీ పూర్ణచంద్రరావు, సంజయ్, మణికంఠ, దుర్గాప్రసాద్, రమేష్‌రాజు, సుధీర్, జయప్రకాష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్కరించిన జయమంగళ.. ఏలూరు వచ్చిన మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల సంభవించిన వరదల ధాటికి కొల్లేరు లంక గ్రామాల్లో జరిగిన నష్టాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొల్లేరు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ప్రాథమిక విద్యకు పూర్వ వైభవం

● 117 జీవో రద్దుకు సీఎం చంద్రబాబు నిర్ణయం ● ఉపాధ్యాయ వర్గాల హర్షం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చొరవతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవం రానుంది. వైకాపా ప్రభుత్వం జీవో నం.117 తీసుకొచ్చి ప్రాథమిక విద్యను నీరుగార్చింది. మూడు, నాలుగు, అయిదు తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలన్న గత ప్రభుత్వ నిర్ణయంతో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమయ్యాయి. దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలకు పంపలేక అప్పులు చేసైనా చాలా మంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైకాపా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీవో నం.117ను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ విషయంపై ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	విలీనమైన పాఠశాలలు
నూజివీడు	66	16	11	08
ఆగిరిపల్లి	33	12	05	11
ముసునూరు	46	08	08	12
చాట్రాయి	49	07	07	01

తగ్గిన ప్రవేశాలు.. పెరిగిన ఏకోపాధ్యాయ పాఠశాలలు

నూజివీడు నియోజకవర్గంలో 194 ప్రాథమిక, 43 ప్రాథమికోన్నత, 31 ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థుల్ని దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో చేర్చారు. ఇలా నియోజకవర్గంలో దాదాపు 42 ప్రాథమిక పాఠశాలలు ఉన్నత పాఠశాలల్లో విలీనమయ్యాయి. విలీనం తరువాత ఏటా ఒకటో తరగతి ప్రవేశాలు పడిపోయాయి. దీంతో ఎక్కువ మంది విద్యార్థులున్న చోటకు ఉపాధ్యాయులను బదిలీ చేశారు. ఈ క్రమంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగాయి.

నిర్ణయం హర్షణీయం

117 జీవోతో జరిగిన విలీనం కారణంగా ఈదర మెయిన్ ప్రాథమిక పాఠశాలలో 137 మంది విద్యార్థులు నుంచి 23 మందికి రోల్ పడిపోయింది. 5 గురు ఉపాధ్యాయులకు ఇద్దరు ఉపాధ్యాయులు మిగిలారు. పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకం చేసింది. ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రద్దుకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. **- ఎం.వేణుగోపాల్, ఎస్టీయూ నాయకుడు**

సర్వత్రా ఆమోదం

117 జీవో అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఉపాధ్యాయులు వ్యతిరేకించారు. బడులకు ప్రయోజనం లేదని వాదించారు. ఎన్డీయే ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ బడులకు పూర్వవైభవం వస్తుంది. **- కె.అజరయ్య, యూటీఎఫ్ నాయకుడు**

ప్రభుత్వ పాఠశాలలకు జీవం

117 జీవో రద్దుతో ప్రాథమిక విద్య బలోపేతం అవుతుంది. హామీ అమలు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. **- కె.వంశీవశిష్ఠ, డీపీఆర్టీయూ నాయకుడు**

పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని ఆందోళన

నూజివీడు, న్యూస్‌టుడే: ఏజెంట్లపై ఎల్ఐసీ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఏజెంట్లు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలసీపై జీఎస్టీ రద్దు చేయాలని, బోనస్‌ను పెంచాలని, ఏజెంట్ కమీషన్‌ను అన్ని పాలసీలపై పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పదవులు శాశ్వతం కాదని, రాజకీయాలకు తావు లేకుండా మండలాభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన కాకరవాడ సర్పంచి కాగిత రామారావుకు రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అధికారులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ, ఈవోపీఆర్డీ బి.అశోక్, ఏవో ఎంవీ.రమణారావు, వైస్ ఎంపీపీ రాచూరి రాధ, వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యనారాయణ

మామిడి మొక్కల తొలగింపు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం మండలం కొండపావులూరులో దాదాపు 119 ఎకరాల ప్రభుత్వ భూమిని జగనన్న కాలనీకి కేటాయించారు. దానిలోని సుమారు 20 ఎకరాలను ప్రభుత్వ పాఠశాల, కార్యాలయాల ఏర్పాటుకు నిర్ణయించారు. కార్యాలయాలు, పాఠశాల ఇతర ప్రభుత్వ అవసరాల నిమిత్తం విడిచిపెట్టిన భూమిలో గతంలో తాము సాగుచేసే వాళ్లమని. . తమకు ఎటువంటి పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం భూమిని అర్ధంతరంగా తీసుకుందంటూ రైతులు ఇటీవల మామిడి మొక్కలు నాటారు. ఆగిరిపల్లి మండలం కనసానపల్లికి చెందిన ఇరవై మంది రైతులు జగనన్న కాలనీ స్థలంలో మొక్కలు నాటారంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. వీఆర్వో గోపాలరావుతో కలిసి మంగళవారం లేఅవుట్‌ను పరిశీలించిన తహసీల్దార్ శివయ్య.. పోలీసుల సమక్షంలో మామిడి మొక్కలను తొలగించారు.


కలిదిండి: ప్రమాణం చేస్తున్న సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

కలిదిండి, న్యూస్‌టుడే: యూటీఎఫ్ కలిదిండి మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి ఎంవీ భేతాళరావు, పరిశీలకుడు పీవీ సాగర్‌బాబు తెలిపారు. కలిదిండిలో మంగళవారం యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షురాలిగా ఎన్ సౌభాగ్యలక్ష్మి, గౌరవ అధ్యక్షునిగా ఎ.రాజమోహన్, ప్రధాన కార్యదర్శిగా కోకా సురేశ్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. బి.ప్రసన్నకుమారి, జి.ఏసురాజు, బి.సరిత, పి.హేమలత తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు: ఆర్డీవో

ముసునూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, ఇకనైనా తీరు మార్చుకోవాలని నూజివీడు ఆర్డీవో ఎం.వాణి అధికారులను హెచ్చరించారు. ముసునూరు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. మండలంలో 88 రైతుల పట్టాదారు పాసు పుస్తకాలు, సర్వేకి సంబంధించి 13, తప్పుల సవరణ కోసం దరఖాస్తు చేసుకున్న 20 పాసు పుస్తకాలు చాలా రోజుల నుంచి పెండిగ్‌లో ఉన్నా ఎందుకు పరిష్కరించడం లేదని, వీధులకు హాజరై ప్రజలకు చేసే సేవలు ఏంటని ఆర్ఐ, వీఆర్వోలు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె అడిగిన ప్రశ్నలకు అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో మీరు చేసే పొరపాటులకు తాము బాధ్యులు కావాల్సి వస్తోందన్నారు. శనివారం మళ్లీ కార్యాలయానికి వస్తానని, ఆ లోపు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారించాలని ఆదేశించారు. అధికారులు సమయ పాలన పాటించి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.


అధికారులతో మాట్లాడుతున్న వాణి

గడువులోగా అర్జీల పరిష్కారం

చాట్రాయి, న్యూస్‌టుడే: భూముల రీ సర్వేలో గతంలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రాలను అందిస్తే పరిశీలించి న్యాయం చేస్తామని ఉప తహసీల్దారు గీత అన్నారు. బూరుగుగూడెంలో మంగళవారం రీ సర్వే గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎంపీపీ లంక నిర్మల, నాయకులు గడ్డం నర్సింహారెడ్డి, కేశవరెడ్డి, గ్రంధాల జయప్రకాష్, శ్రీమన్నారాయణ రైతులు పాల్గొన్నారు.

ముసునూరు: ముసునూరు మండలం యళ్లపురంలో సర్పంచి మొక్కపాటి మురళీకృష్ణ అధ్యక్షతన రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ శర్మ మాట్లాడుతూ.. అర్జీలను పరిశీలించి గడువులోగా పరిష్కరిస్తామన్నారు. వీఆర్వో మహేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


బూరుగుగూడెం: అర్జీ స్వీకరిస్తున్న ఎంపీపీ నిర్మల

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	జనక అయితే గనక
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	....
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ద్వారక సినిమాస్ స్క్రీన్3	వేట్టయన్
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	మార్టిన్
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	వేట్టయన్
శ్రీవెంకటరమణ సినిమాస్	విశ్వం
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కైకలూరు, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర అన్నారు. మండలంలోని భుజబలపట్నం, పల్లెవాడ, ఆలపాడు గ్రామ సచివాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టిక, శాఖాపరమైన దస్త్రాల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజా సమస్యలు, మౌలిక వసతుల అవసరాలను గుర్తించాలన్నారు. పలు గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.


పల్లెవాడ: దస్త్రాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఫణీంద్ర

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

చాట్రాయి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు వస్తాయని, రైతులు దానిపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారి బండారు శివశంకర్ అన్నారు. కోటపాడు, చీపురుగూడెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వరి పైరును రైతులతో కలిసి పరిశీలించారు. తెదేపా నాయకులు మంచిన పూర్ణ, బొట్టు రామచంద్రరావు, బొట్టు లక్ష్మణరావు, మోరంపూడి రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండల వ్యవసాయాధికారిణి వేణుమాధవ్ ఆధ్వర్యంలో ముదినేపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

మండవల్లి: మండల వ్యవసాయశాఖ అధికారిణి షేక్ జరీనా ఆధ్వర్యంలో మండవల్లి, కానుకొల్లు రైతు సేవా కేంద్రాల వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్, కూటమి నాయకులు గూడవల్లి కోటేశ్వరరావు, తణకుల శ్రీనివాస్, ఆర్.రాము తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లి: సూచనలిస్తున్న వేణుమాధవ్

'తప్పులతడకగా ఈ-పంట నమోదు'

ముసునూరు, న్యూస్‌టుడే: ఈ-పంట నమోదు తప్పులతడకగా సాగిందని, వాటి వివరాలను రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల్లో సామాజిక తనిఖీ కోసం బహిరంగ పరచలేదని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య అన్నారు. ముసునూరు మండలం వలసపల్లి, గుళ్లపూడి, గుడిపాడు గ్రామాల్లో రాయంకుల లక్ష్మణరావు, నిమ్మగడ్డ నరసింహ, చెంగల వెంకటేశ్వరరావు, కొక్కిరిపాటి ఆనంద్, పామర్తి మధు మంగళవారం ఈ-పంట నమోదు, కౌలు రైతులకు కౌలు కార్డుల పరిశీలన, పంట రుణాల మంజూరుకై క్షేత్రస్థాయిలో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల పేరుతో ఈ-పంట నమోదు కాకుండా భూ యాజమానుల పేరుతోనే చేశారన్నారు. ఈ మూడు గ్రామాల్లో కలిపి 500 మంది కౌలు రైతులుంటే కేవలం 154 మందికి మాత్రమే కౌలు కార్డులు మంజూరు చేయగా వాటిలో కొన్ని బోగస్ కార్డులు ఉన్నట్లు సర్వేలో తెలిందని ఆరోపించారు.


ముసునూరు: మాట్లాడుతున్న జమలయ్య